ఈ ఏడాదైనా పరిహారం అందేనా..?



సారంగాపూర్‌లో ఓ గిరిజన రైతు సాగుచేసిన భూమిలో ఇసుకమేటలు



బ్లేడ్ ట్రాక్టర్ల సహాయంతో ఇసుక మేటలను తొలగించుకుంటున్న రైతులు

- ప్రారంభం కాని పూర్తిస్థాయి సర్వే
- రైతులకు భారీగా నష్టం
- సాగుకు సిద్ధం చేసుకుంటున్న రైతన్నలు

సారంగాపూర్: భారీ వర్షాలతో రెండేళ్లుగా రైతులను ప్రకృతి పగబడుతోంది. గతేడాది లాగే ఈ ఏడాదీ భారీ వర్షాలు సాగుభూములపై తీవ్ర ప్రభావం చూపాయి. గతేడాది వర్షాకాలంలో భారీ వరదలు, వర్షాలతో వందలాది ఎకరాల సాగుభూముల్లో ఇసుకమేటలు వేసి, భూములు కోతకు గురయ్యాయి. వర్షాకాలంలోనూ ఇదే పరిస్థితి ఏర్పడి వందలాది ఎకరాల్లో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. పదిహేను రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలకు చాలా రైతుల భూముల్లో ఇసుకమేటలు పెట్టాయి. భూముల్లో కోతకు గురయ్యాయి. నాటు వేసిన పొలాలు, సాగుచేసిన పంటలకు సైతం తీవ్ర నష్టం వాటిల్లింది.

సారంగాపూర్‌లో 300, బీర్‌పూర్‌లో 35 ఎకరాల్లో ఇసుక మేటలు

వర్షాలు, వరదల కారణంగా సారంగాపూర్ మండలంలో 300 ఎకరాలకు, బీర్‌పూర్ మండలంలో 35 ఎకరాల్లో ఇసుక మేటలు పెట్టినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక సర్వే ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. గతేడాది ఇసుకమేటలు వేసిన భూములకు పరిహారం అందకపోవడంతో, కనీసం ఇప్పుడైనా పరిహారం ప్రభుత్వం అందిస్తుందా అన్న ఆందోళనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరాలో ఇసుకమేటలు పెడితే ఇసుకను బ్లేడ్ ట్రాక్టర్ల ద్వారా తొలగించి, తిరిగి సేద్యానికి అనుకూలంగా మార్చడానికి రూ. 20 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో పాటు ఇసుకమేటలు పెట్టిన భూముల్లో వరద కారణంగా భూమిలోని సారం మొత్తం కొట్టుకుపోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

నాట్లేసిన పొలాల్లోను ఇసుకమేటలు..

చాలా గ్రామాల్లో వరదల సమయంలోనే నాట్లు వేసిన పొలాల్లోను ఇసుకమేటలు పెట్టడంతో రైతులు మరింత నష్టపోయారు. నాటువేసిన ఖర్చులు, ట్రాక్టర్లు పంట సాగుచేయడానికి అయిన కూలీల ఖర్చులు, వంటి వాటితో నష్టం ఎకరాకు రూ. 30 వేల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు..

తిరిగి సేద్యానికి అనుకూలంగా మార్చుకుంటున్న రైతులు

నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేలు అందిస్తామని ప్రకటించినా, ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి భరోసాను రైతులకు అధికారులు కల్పించలేకపోతున్నారు. రెతులు ఇసుకమేటలు పెట్టిన భూములను తిరిగి నాటు వేయడానికి , ఇతర పంటలు సాగుచేయడానికి ప్రభుత్వం నుండి పరిహారం అందకపోయినా సొంతగా పెట్టుబడి పెట్టి తిరిగి సాగుకు అనూకలంగా బ్లేడ్ ట్రాక్టర్లతో ఇసుకను తొలగించి సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా పరిహారం అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



ఇసుకమేటలు పెట్టడంతో తీవ్రంగా నష్టపోయాం. నేను భూమిని కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. వర్షాలకు సాగుచేసిన వరి మొత్తం కొట్టుకుపోయి, భూమిలో ఇసుకమేటలు పెట్టడంతో ఎకరాకు రూ. 30 వేలకు పైగానే నష్టపోయాను. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– కొత్తూరి పుష్పనాథ్, నాయికపుగూడెం, సారంగాపూర్

ఆదేశాలు అందగానే పూర్తిసర్వే



భారీ వర్షాలతో సాగు భూముల్లో ఇసుకమేటలు పెట్టాయి. ప్రభుత్వానికి ఇసుక మేటలు పెట్టిన భూమిల్లో ప్రాథమిక నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే రైతుల వారిగా సర్వే జరిపి పరిహారం అందించడానికి నివేదిక పంపిస్తాం.

– తిరుపతినాయక్, వ్యవసాయాధికారి, సారంగాపూర్

క్లుప్తంగా

స్వాతంత్ర్య పోరాటంలో ఏఐఎస్ఎఫ్ కీలకపాత్ర



జెండా ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

జగిత్యాల: దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర అని జిల్లా కార్యదర్శి అక్రమాలిక్ అన్నారు.ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం చైతన్య కళాశాల ఆవరణలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని పేర్కొన్నారు. విద్యారంగం కోసం భవిష్యత్‌లో మరింత పోరాటానికి సిద్ధంగా ఉంటామన్నారు. అనంతరం ఆనంద నిలయంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మేకల సంజయ్, వంశీ, రాహుల్, నాగరాజు, గణేశ్, రోహిత్, సుష్మ స్వరాజ్ పాల్గొన్నారు.

న్యాయవాదుల క్రికెట్ పోటీలు



న్యాయవాదుల జట్టుతో న్యాయమూర్తులు

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ క్రికెట్ పోటీలను మొదటి అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ జితేందర్, రెండో అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్, మెట్‌పల్లి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదటి అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ జట్టుపై రెండో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, కార్యదర్శి రామకృష్ణారావు, కోశాధికారి చంద్రమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

35 సార్లు రక్తదానం చేసిన శ్రీకాంత్



శ్రీకాంత్

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన గూడురు శ్రీకాంత్ మండలంలోని వేములకుర్తిలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ 35 సార్లు రక్తదానం చేశారు. కోరుట్లలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ నిమిత్తం చెన్నవేని లక్ష్మి అనే మహిళకు ఓ పాజిటివ్ రక్తం అత్యవసరంగా ఉండడంతో సమాచారం తెలుసుకున్న శ్రీకాంత్ శనివారం రక్తదానం చేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.

‘ఎమ్మెల్యే కనుసన్నల్లో బీసీబంధు లబ్ధిదారుల ఎంపిక’



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రాయికల్: బీసీ బంధు లబ్దిదారుల ఎంపిక పూర్తిగా ఎమ్మెల్యే కనుసన్నల్లో జరిగిందని, అర్హులైన వారికి అన్యాయం చేశారని శనివారం రాయికల్‌లో బీజేపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీసీల్లో కులవృత్తులు చేసుకునే ప్రతి ఒక్కరికీ పథకం వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా సాగిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కల్లెడ ధర్మపురి, కునారపు భూమేశ్, బన్న సంజీవ్, రాజనాల మధు, చెలిమెల లోకేశ్, సింగని సతీశ్, మచ్చ నారాయణ, సామల్ల సతీశ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను . తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు శనివారం ఆవిష్కరించారు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహించనున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు భారీగా హాజరు కావాలని తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలను వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అయిల్నేని నరేందర్‌రావు, ఒడ్నాల రాజశేఖర్, జిల్లా నాయకులు ప్రసాద్‌రావు, మహిపాల్ రెడ్డి, రఘునందన్, రాజేందర్, రజినీకాంత్,సురేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



విద్యార్థులతో జెడ్పీచైర్‌పర్సన్, నరేందర్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులను ప్రోత్సహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం అల్ఫోర్స్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు కళాశాలలో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు, సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి కనబర్చేలా చూడాలని, మన దేశ చరిత్ర ప్రపంచానికే గొప్పదన్నారు. అల్ఫోర్స్ అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ తెలంగాణ విద్యారంగానికి ఎంతో కృషి చేస్తుందని, విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మెట్‌పల్లి రూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మాట్లాడారు. వర్షాలతో పలు చోట్ల పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనాలను రూపొందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు సర్వే చేపట్టలేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే పూర్తిస్థాయి పంటల సర్వే చేపట్టాలని కోరారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో పంట పొలాలకు వెళ్లే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని వెంటనే పునరుద్ధరించాలన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



కంటి పరీక్ష చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆపీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 15 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పేదలు ఉచితంగా కంటి ఆపరేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, కౌన్సిలర్ రాజేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మేదరి సంఘం నాయకులు

జగిత్యాల జిల్లా మహేంద్ర మేదరి సంఘం నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నిక కాగా, వారు శనివారం ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చింత గంగారాం, భీమయ్య, రాజేశం, గంగాధర్, దశరథ్, సురేశ్, శంకర్, రాజేశం పాల్గొన్నారు.

పీఈటీలకు అభినందన

కేజీబీవీ పీఈటీగా ఎంపికైన నవత, రాజ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండు వార్డుల్లో పర్యటన

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శనివారం జగిత్యాల పట్టణంలోని 23,24 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు ఉన్నారు.

మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాలక్రైం: మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి చేస్తోందని సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో యాంటీ ఉమెన్ ట్రాకింగ్ యూనిట్ అధికారులు అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలల్లో అందరు కలిసి మెలిసి ఉండాలని, సీనియర్స్, జూనియర్స్ అనే బేదం లేకుండా ఒకరికొకరు చదువులో సహాయం చేసుకుంటూ ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా కష్టపడి చదువుకోవాలన్నారు. లింగ వివక్షత నిర్మూలనకు నాంది పలకాలని, ఎవరైనా లింగ వివక్షతను ఎదుర్కొన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్ అవసరం మేరకే ఉపయోగించాలని, ఎవరు కూడా సైబర్ నేరాలకు గురికావద్దని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు రెస్పాండ్ కావద్దన్నారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీటీం నంబరు 8712670783కి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో షీటీం ఎసై వెంకటేశ్వర్లు, ఏఎస్సై అలీబేగ్, మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, మంజూ పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి’



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సుజిత్‌రావు

మల్లాపూర్: బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుట్రపూరితంగా ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని చేస్తున్న కుట్రలకు కార్యకర్తలు తిప్పికొట్టాలని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. శనివారం మల్లాపూర్, కొత్త దాంరాజుపల్లి గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి మాట్లాడారు. రాజకీయాల్లో పదవులతో సంపాదించేది ఒక్కటేనని, అది ప్రజలకు, కార్యకర్తలకు సేవ చేశామన్న సంతృప్తి కోసమేనన్నారు. కార్యకర్తలు, ప్రజల ప్రేమాభిమానాలే రాజకీయాల్లో నన్ను ఏళ్లవేళలా ముందుకు నడుపిస్తాయన్నారు. అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామాన తిరిగి రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని విజ్ఞప్తిచేశారు.కార్యక్రమంలో పీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, రాజరెడ్డి, గంగాధర్, లింగారెడ్డి, రాజం పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి: ఎల్ఎం కొప్పుల ట్రస్ట్,భారత జాగృతి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని భారత జాగృతి ధర్మపురి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రాపర్తి విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లోజాగృతి ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సుమారు 60కి పైగా కంపెనీల నుంచి నాలుగు వేలకు పైగా ఉద్యోగాల కోసం ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిని యువతీ యువకులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భారత జాగృతి ప్రతినిధులు జాడి శ్రీనివాస్,కొంక సుధీర్, ఎల్ఎం కొప్పుల ట్రస్ట్ ప్రతినిధులు నూతి మల్లన్న,మామిడాల రవీందర్,అనంతుల లక్ష్మణ్,అపర్ణ,ఆకుల స్వేచ్ఛ,రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మెట్‌పల్లి రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని వేంపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల్లో,వసతి గృహాల్లో కిటికీలు,తలుపులు లేకుండానే తరగతి గదులు,వసతి గదులు ఉన్నాయని తద్వారా పాములు,తేళ్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. గురుకులాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

భక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవం

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీభక్త మార్కండేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, హోమం, కుంకుమపూజలను బ్రాహ్మణుడు గుండి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా పద్మశాలీ కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ సాగర్‌రావు, ఆలయ చైర్మన్ వెంకటేశం, నాయకులు భూమయ్య, మల్లేశం, నర్సయ్య, గోపి, శంకరయ్య, రాజేశం, రమేశ్, వెంకటరాజం, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం



నియామక పత్రాలు అందిస్తున్న విజయలక్ష్మి

కోరుట్ల: కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షులను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి శనివారం నియమించారు. ఈ మేరకు పట్టణంలోని జువ్వాడి భవన్‌లో నియామక పత్రాలు అందజేశారు. కోరుట్ల పట్టణ అధ్యక్షురాలిగా మచ్చ కవిత, మెట్‌పల్లి, కోరుట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాళ్లుగా ఎల్లాల కవిత, బుస అనితను నియమిస్తూ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, కోరుట్ల పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ గౌడ్, కొంతం రాజం,నాయకులు పాల్గొన్నారు.

‘పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా?’



రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

వెల్గటూర్: సాగునీరు రాక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. ఎస్సారెస్పీ డీ–83బీ కెనాల్ నుంచి నీరు విడుదల చేయాలని ఎండపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు 7వ నెంబర్ రాష్ట్ర రహదారిపై శనివారం బీజేపీ నాయకులు ధర్నాకు దిగారు. ధర్మారం, వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే ఎస్సారెస్పీ డీ–83బీ కెనాల్ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఏడాది గడిచినా దాన్ని పునరుద్ధరించకుండా వానాకాలం పంటసాగు ప్రారంభమైన తర్వాత ఇప్పుడు టెండర్లు పిలిచి నెల రోజుల క్రితం పనులు ప్రారంభించి, 12 గ్రామాలకు రావలసిన సాగు నీరు నిలిపివేశారన్నారు. 15 రోజులుగా వర్షాలు లేకపోవడం, కెనాల్ నీరు రాకపోవడంతో పత్తి పంట ఎండిపోతుందన్నారు. 2 రోజుల్లో రిపేర్లు పూర్తి చేసి రైతులకు నీరందించాలని లేకపోతే జగిత్యాల డీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం, కొత్తపేట సర్పంచ్ కొమ్ము రాంబాబు, వెల్గటూర్ మండల బీజేపీ అధ్యక్షులు చక్రపాణి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

‘గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం’

బుగ్గారం: బుగ్గారం గ్రామపంచాయతీలో భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందని గ్రామాభివృద్ధి కోర్ కమిటీ అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి అన్నారు. శనివారం మాట్లాడుతూ నిధుల దుర్వినియోగానికి సంబంధించి పలు విషయాలు వెల్లడించారు. ఉన్నతాధికారుల అలసత్వం, నిర్లక్ష్యంతోనే విచారణ జాప్యం జరుగుతుందని, ముగ్గురు డీపీవోలు విచారణ చేసినా ఫలితం శూన్యమన్నారు. జీపీలోని పలు రికార్డులు సైతం మాయమయ్యాయని, రాజకీయ ఒత్తిళ్ల తోనే జీపీలో జరిగిన అవినీతి బయటపడడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే తాము లోకాయుక్తను ఆశ్రయించాల్సి వచ్చిందని అన్నారు.ఆలస్యంగానైనా సరే సత్యమే జయిస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగాన్ని బట్టబయలు చేసి ప్రజలలో విశ్వాసాన్ని నెలకొల్పాలని కోరారు.

మీసేవా కేంద్రాల్లో రెన్యూవల్ చేసుకోవాలి

కోరుట్ల: పట్టణంలోని వ్యాపారస్తులు, షాప్ యజమానులు తమ దుకాణాల లైసెన్సులను మీసేవా కేంద్రాల్లోనే రెన్యూవల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరో అపరిచిత వ్యక్తులు షాప్‌ల రెన్యూవల్ చేసుకోవాలని ఫోన్‌పే, గూగుల్ పే చేయాలని ఫోన్‌లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి ఫోన్‌లు నమ్మవద్దని పేర్కొన్నారు. లైసెన్సు రెన్యూవల్ కోసం మున్సిపల్ నుంచి అలాంటి ఫోన్‌లు ఏమి రావని, వ్యాపారస్తులు మోసపోవద్దని పేర్కొన్నారు.

గెస్ట్ పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మల్లాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గెస్ట్ పీజీటీ పోస్టుల భర్తీకి అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ.అలీమొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులకు జంతుశాస్త్రం బోధించుటకు పీజీటీ (జువాలజీ), జీవశాస్త్రం బోధించుటకు పీజీటీ (బోటనీ) పోస్టులకై తాత్కాలిక ప్రాతిపదికన (హావర్లీ బేసడ్) పనిచేయుటకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంఎస్సీ, ఎంఈడీ విద్యార్హతలతో పాటు టెట్ అర్హత పొందిన అభ్యర్థులు 14లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్ 9849618625 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు గృహలక్ష్మి పథకంపై అవగాహన

పెగడపల్లి: గృహలక్ష్మి పథకం విధివిధానాలపై మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14న సోమవారం ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పుల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ హోదాలో ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో మండల అదనపు పశువైద్యాధికారి నరేశ్ రెడ్డి ఆధ్వర్యంలో పశువులకు శనివారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువుల నోటిపుండ్లు ఏర్పడి లాలాజలం కారుతుందన్నారు. అంతేకాకుండా పాల దిగుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారెడ్డి, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

కథలాపూర్: మేడిపెల్లి మండలం తొంబర్రావుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత గోలి మోహన్ శనివారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడి ధర్మారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా :
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల : రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899